epaper.manachourasta.com

# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక



నేడు కేటీఆర్ రాక 4

సంపుటి : 01 | సంచిక : 39 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 06 జనవరి 2026 | పేజీలు : 04




## విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు
# దిక్సూచి

- అధికారులు సమన్వయంగా పని చేయాలి
- కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. జనగామ జిల్లా విద్యార్థుల ఆరోగ్య సమగ్రాభివృద్ధి దిశగా జరుగుతున్న దిక్సూచి (DIKSUCHI) కార్యక్రమం అమలుపై జిల్లాస్థాయి కన్వర్జెన్స్ సమావేశ హాల్ లో సోమవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులలో ఆరోగ్య అవగాహన, అనారోగ్య సమస్య ల ముందస్తు గుర్తింపు, చికిత్స, ఫాలోఅప్ సేవలను ఒకే వేదికపై సమన్వయంతో అందించడమే దిక్సూచి కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. విద్య, ఆరోగ్య, సంక్షేమ శాఖల మధ్య సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. దిక్సూచి కార్యక్రమం ద్వారా విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం, పోషణ స్థితి, జీవనశైలి మార్పులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నరన్నారు. RBSK, PHCs, ఇతర ఆరోగ్య విభాగాల సేవలను విద్యాసంస్థలతో అనుసంధానం చేసి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. దిక్సూచి కార్యక్రమం ద్వారా మొత్తం 15,193 విద్యార్థులకు గాను 14478 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డ్స్ ఇచ్చారని.. ఇందులో 1210 మందికి జనగామ ప్రభుత్వ ఆసుపత్రి కి రెఫెర్ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 12 వ తేదీ లోగ మిగిలిన విద్యార్థులందరికి హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, ప్రతిరోజు విద్యా సంస్థలలో విధిగా ఉదయం సాయంత్రం 15 నిముషాలు అనేమియా పీరియడ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీఎంహెచ్ వో డా. కె.మల్లికార్జున రావు, సంబంధిత జిల్లా సంక్షేమ అధికారులు, వైద్యాధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలలు/కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రీ-మెట్రిక్ హాస్టళ్ల వార్డెన్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.




# పోట్లపల్లి దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలి



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ మండలంలోని ప్రసిద్ధ శ్రీ స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాడు హిందూవాహిని హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా హిందూ సంఘా నాయకులు బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వేములవాడ పుణ్యక్షేత్రం తరువాత పోట్లపల్లి దేవా స్థానాన్ని ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తానని, మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గతంలో బాండ్ పేపర్ రాసి హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా గుడి అభివృద్ధి చెందలేదని, మంత్రి గారైనా అభివృద్ధి చేస్తారని, భక్తులు, ప్రజలు ఆశించిన ఫలితం లేదని, మంత్రి మాటలకు పరిమితమైరని విమర్శించారు. మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు మౌళిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా మంత్రి ఆలయంలో టాయాలెంట్స్, మంచినీటి సౌకర్యం, విశ్రాంతి భవనాలు, షెడ్స్, ఆలయ ముఖద్వార నిర్మాణం పూర్తి చేసి, మహాశివరాత్రి వరకు భక్తులకు సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హిందూ సంఘాల నాయకులు కవ్వ వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ హిందువుల పట్ల మంత్రి నిర్లక్ష్యం వహిస్తున్నారనా, క్రిస్మస్, రంజాన్ పండుగలకు ప్రత్యేక నిధులు కేటాయించి, వారి పండుగలు ప్రభుత్వం నిర్వహించి, సంబురాల్లో పాల్గొంటుతోందని, హిందువులపై ఎందుకు ఇంత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. వెంటనే ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హిందూ వాహిని జిల్లా సహ సంయోజక్ పూదరి వెంకటేష్ మాట్లాడుతూ గతంలో అభివృద్ధి నోచుకోలేదని, ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గుడి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు పెందోట అనిల్, గోల్లపెల్లి వీరాచారి, గాదాసు రాంప్రసాద్, వరియోగుల అనంతస్వామి, పోలోజు రాజేందర్ చారీ, వడ్డెపల్లి లక్ష్మయ్య, అశాడపు శ్రీనివాస్, బొప్పిశెట్టి సాయిరామ్, అబ్బిడి లింగారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ ఉద్యమ సమయంలో నిరుద్యోగులుగా మిగిలిపోయిన పేద ధూంధాం కళాకారులకు ప్రజా ప్రభుత్వం న్యాయం చేసిందని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి చెందిన ధూంధాం నిరుద్యోగ కళాకారుడు కనకం వెంకట్ అన్నారు. గత 12 ఏండ్లుగా నిరుద్యోగ ధూంధాం కళాకారుల ఉపాధి, ఉద్యోగాల కోసం సాగుతున్న పోరాటానికి ప్రజా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేసిందని పేర్కొన్నారు.ఇచ్చిన హామీ ప్రకారం జీవో ప్రవేశపెట్టి బిల్లును పాస్ చేసి ఉద్యమ కళాకారులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, చైర్మన్ వెన్నెల గద్దర్‌తో పాటు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అలాగే నిరుద్యోగ కళాకారుల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ కళాకారులు కవిగాయకుడు నేర్నాల కిషోర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# నారుమడులకు రక్షణ చర్యలు తీసుకోవాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చలి తీవ్రత అధికంగా ఉన్నందున యాసంగి నారుమడులకు రక్షణ చర్యలు చేపట్టాలని భీమదేవరపల్లి మండల వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎల్.పద్మ మాట్లాడుతూ, చలి ప్రభావంతో నారు పెరుగుదల తగ్గి ఆకులు పసుపు, ఎరుపు రంగులోకి మారడం, కొన్నిసార్లు నారు చనిపోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యలు రాకుండా ఉండేందుకు సాయంత్రం వేళల్లో నారుమడిలోని నీటిని తీసివేసి, పగటి పూట వెచ్చని నీటిని పెట్టాలని సూచించారు. జింక్ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే, లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. నారు ఆరోగ్యంగా పెరగాలంటే యూరియా వేస్తున్న సమయంలో ఒక కిలో యూరియాకు రెండు గ్రాముల కార్బెండజిమ్ మరియు మాంకోజెబ్ మిశ్రమ మందులు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలచు పురుగు నివారణకు ఎకరా నారుమడికి ఒక కిలో చొప్పున కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లాలని తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండి మంచుతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశమున్నందున అగ్గి తెగులు వంటి రోగాలు రాకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కమలహాసన్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ సాధించిన ముల్కనూరు విద్యార్థిని




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన శ్రీ సరస్వతి శిశు మందిర్ పూర్వ విద్యార్థిని దొంగల ఉమాదేవి హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ MBA విభాగం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. గ్రామీణ మహిళల సాధికారతలో సహకార పాడి పరిశ్రమ పాత్ర అనే అంశంపై ఆమె పరిశోధన చేపట్టగా, ఈ పరిశోధన పత్రాన్ని డా. పి. రాజేందర్ మార్గదర్శకత్వంలో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో సమర్పించారు. డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా ముల్కనూరు గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, మిత్రబృందం దొంగల ఉమాదేవిని ఘనంగా అభినందించారు. ఆమె సాధించిన ఈ ఘనత గ్రామానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# గురువన్న పేటలో వనమహోత్సవం

**కొమురవెల్లి మన చౌరస్తా:** కొమురవెల్లి మండల కేంద్రంలోని గురువన్నపేట గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపుగా మూడు వేలకు పైగా మొక్కలు నాటి నర్సరీగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ జహంగీర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటి వద్ద వృక్షాన్ని ఏర్పాటు చేయడం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సతీష్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ పుట్ట కనకయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఫ్లిప్‌కార్ట్ పార్సల్ లారీ బోల్తా

**భీమదేవరపల్లి, మన చౌరస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ కమాన్ సమీపంలో ముల్కనూర్ శివారు హైవే రోడ్డుపై ఫ్లిప్‌కార్ట్ పార్సల్ హనుమకొండ నుండి హుస్నాబాద్ వైపు తీసుకు వెళుతున్న TS12 UA 5944 నెంబర్ గల ట్రాన్స్పోర్ట్ లారీ అదుపుతప్పి వరి కొయ్యల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.



# దత్తత గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** దత్తత తీసుకున్న గ్రామాల అభివృద్ధికి తాను సంపూర్ణంగా కట్టుబడి ఉన్నానని కావేరి సీడ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గుండవరపు భాస్కరరావు తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని బొల్లోనిపల్లి గ్రామ సర్పంచ్ బొల్లి మానస ప్రశాంత దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని కావేరి సీడ్స్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులను భాస్కరరావు ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తాను దత్తత తీసుకున్న ఘటనరసింగాపూర్, బొల్లోనిపల్లి గ్రామాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందంజలో ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నూనె సదానందం, పతిపాక భిక్షపతి, పొన్నం సతీశ్, తోర్రి గట్టయ్య, అరుకాల రంజిత్, మండల కొమ్రయ్య, అన్నబోయిన శ్రీనివాస్, కత్తుల కుమార్, బొల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల అలసత్వంపై కలెక్టర్ ఆగ్రహం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో కొలువైన శ్రీ వీరభద్ర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముల్కనూరు, వేలేర్, ధర్మారం తదితర గ్రామాల నుంచి కొత్తకొండకు వచ్చే రహదారుల గుంతలు పూడ్చడం, జంగిల్ కటింగ్ వంటి పనుల్లో అలసత్వం వహించిన ఆర్ అండ్ బి అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతర ఏర్పాట్లను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సుమారు ఐదు లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేసిన త్రిశూలం చౌరస్తాతో పాటు పనిచేయని సోలార్ విద్యుత్ లైట్లను వెంటనే సరిచేయాలని తెలిపారు. కొండపైకి వెళ్లే రహదారి నిర్మాణ పనులను కూడా అధికారులు పరిశీలించాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ సమీక్ష సమావేశం నిర్వహించామని, బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా కొత్తకొండ గ్రామ సర్పంచి సిద్ధమల్ల రమా రమేష్ మాట్లాడుతూ, జాతర సందర్భంగా ప్రతి ఇంటికి పెద్ద సంఖ్యలో బంధువులు వస్తారని, రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని పేర్కొంటూ ప్రత్యేక మరమ్మత్తుల నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఎన్పీడీసీఎల్ ఎస్సీఇ మధుసూదన్ రావు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ గాయత్రి, డీఈ అనిల్, డీఎం అర్పిత, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీఈ శిరీష, తహసిల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఆలయ ఉపరాణ అర్చకులు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ వ్యవస్థ ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారు

## సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్



చేర్యాల, మన చౌరాస్తా : దోపిడీ వ్యవస్థ ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని, ఓట్లు, సీట్ల కోసం కాదు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం పని చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. సోమవారం సీపీఐ మండల కోశాధికారి నంగి కనకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఈ అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం కొంతమంది కమ్యూనిజం అయిపోయిందని మాట్లాడుతున్నారని, ప్రజల పక్షాన ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ నిరంతరం తమ పార్టీ ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటుందన్నారు. దోపిడీ వ్యవస్థ ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని స్పష్టం చేశారు. దేశంలో ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఈ శక్తులను ఎదిరించేందుకు వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. నాటి త్యాగాల స్పూర్తితో ప్రజా పోరాటాల నిర్మాణంతో పాటు ప్రజల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. స్థానికంగా చేర్యాల మున్సిపాలిటీలో సమస్యలు నెలకొన్నాయని రోడ్డుకు ఇరువైపులా పలుచోట్ల డ్రైనేజీ మురికి కాలువలు నిర్మించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. మురికి నీటితో దుర్గంధం వెదజల్లుతూ దోమలు విజృంభిస్తున్నాయని అధికారులు, కాంట్రాక్టర్ తీరు పై మండిపడ్డారు. స్థానిక సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, డివిజన్ నాయకులు వలబోజు నర్సింహా చారి, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, గూడెపు సుదర్శన్, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, ఎగుర్ల ఎల్లయ్య,పొన్నబోయిన శ్రీనివాస్, నంగి సత్తయ్య, కర్రె నర్సిరెడ్డి, సత్తాల మహేష్, ప్రేమ్ కుమార్, కిష్టయ్య, మహేందర్, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షురాలు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్, పీసీసీ సభ్యులు లక్ష్మీనారాయణ నాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (డీసీసీ ఆఫీస్) నిర్మాణం కోసం జనగామ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ అనుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం జనగామ పట్టణ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఓటరు జాబితాలో జరిగిన తప్పిదాలు, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడటం, చిరునామా లోపాలు, డూప్లికేట్ నమోదులు వంటి అంశాలపై పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లతో కలిసి డిసిసి అధ్యక్షురాలు కలెక్టర్‌కు వివరంగా వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి,ఉడత రవి,తాజా మాజీ కౌన్సిలర్లు గాదేపాక రామ్ చందర్, జక్కుల అనిత వేణు, మూడావత్ సంపత్, పింగిలి ఇంద్ర రెడ్డి, కోటా నాయక్, గొలుసుల దుర్గేష్, వార్డు అధ్యక్షులు మచ్చ ప్రవీణ్, కళ్యాణం సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు బక్క ప్రవర్ధన్ పాల్గొన్నారు.



# రోడ్డుపై గల కల్వర్టుకి మరమ్మతులు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రసులాబాద్ గ్రామంలో సోమవారం రోజు కొమురవెల్లి ఎంపీడీవో గ్రామాన్ని సందర్శించి నర్సరీలో గ్రామానికి సరిపడే మొక్కలు పెంచాలని సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామి గౌడ్ సెక్రటరీకి సూచనలు ఇచ్చారు. కొమురవెల్లి నుండి అయినాపూర్ వెళ్లే రోడ్డు మార్గమధ్యలో దుర్గమ్మ గుడి సమీపంలో కల్వర్టు కొద్ది రోజుల క్రితం వేసిన రోడ్డు బ్రిడ్జికి సమానంగా ఉన్నందున అక్కడ ప్రమాదం పొంచి ఉన్నందున రసులాబాద్ గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి అక్కడ ఇరుపక్కల రైలింగ్ నిర్మించడానికి తీర్మాంచడం జరిగింది. అట్టి పనిని ప్రారంభించిన దాన్ని సందర్శించిన ఎంపీడీవో ఇలాంటి ప్రమాదవశాత్తు ఉన్న వాటిని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్ మాజీ సర్పంచ్ స్వామి గౌడ్, వార్డు సభ్యులు మల్లేశం, బౌధూర్, మంజుల, పరశురాములు, అశోక్, కిరణ్, శ్రీనివాస్, ఐలేని, మహిపాల్, సంతోష్, గ్రామ సిబ్బంది రాజు, తదితరులు పాల్గొన్నారు.

# తప్పులతడకగా ఓటర్ జాబితా

## సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపాలిటీ పట్టణంలో 30 వార్డుల ఓటర్ లిస్టు తప్పులతడకగా ఉందని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో మున్సిపాలిటీ 30 వార్డుల ఓటర్ లిస్టు తప్పులతడకగా ఉందన్నారు. ఒక వార్డుకు సంబంధం లేకుండా మరొక వార్డు ఓట్లు నమోదు చేస్తూ ఉన్నది అధికారుల నిర్లక్ష్యం అని అన్నారు. పెంబర్తి, షామీర్‌పేట ఓట్లు ఐదో వార్డ్‌లో నమోదు కావడం అధికారులు నిర్లక్ష్యమమే అన్నారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొనాల్సిన అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ లేకపోవడం ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. ఒక వార్డు ఓట్లు ఒక వార్డులో చేర్చడం వలన రిజర్వేషన్ ప్రక్రియ మారిపోతుంది దీనితో పాటు నష్టం జరిగే అవకాశం ఉందని, దీనిని సవరించాలని కోరారు. లేకపోతే అఖిలపక్ష పార్టీలను కలుపుకొని ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఒక సభ్యులు బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఎండి అజారుద్దీన్, నాయకులు పురుషుల కుమార్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీ




**జనగామ, మన చౌరాస్తా :** జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలలో భాగంగా జనగామ రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో జనగామ పట్టణంలోని పలు ప్రైవేట్ స్కూల్ బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను డ్రైవర్ కు సంబంధించిన లైసెన్స్ లను తనిఖీ చేసి స్కూల్ యాజమాన్యాలకు రోడ్డు భద్రతకు సంబంధించిన నియమ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు మహేష్ గౌడ్, శ్వేత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## తిరిగి విధుల్లోకి తీసుకోవాలని

# గ్రీవెన్స్‌లో వినతి


**జనగామ, మన చౌరాస్తా :** గతంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పని చేసిన తనను తిరిగి విధుల్లో తీసుకోవాలని జనగామకు చెందిన జి.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన గ్రీవెన్స్ లో వినతి పత్రాన్ని అందజేశారు. జనగామ జిల్లా సమాచార, పౌరసంబంధాల కార్యాలయంలో 2023 డిసెంబర్ 08 నుంచి ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యగంలో చేరి అంకితభావం, నిబద్ధతతో విధులను నిర్వర్తించానని పేర్కొన్నారు. కొన్ని కారణాల వల్ల 2024 జులై నుంచి రాష్ట్ర ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో మా సేవలను నిలిపివేశారని, అయినా తాను జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం డీపీఆర్ ఆధ్వర్యంలో జులై 15, 2024 నుంచి జూన్ 15, 2025 వరకు ఎటువంటి వేతనం లేకుండా సంవత్సర కాలం పాటు ఉద్యోగంలో కొనసాగుతూ బాధ్యత, క్రమశిక్షణతో పార్లమెంట్, శాసనమండలి ఎన్నికల విధులు కూడా నిర్వర్తించడం జరిగిందని తెలిపారు. ఉద్యోగం కోసం పలు మార్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిని, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. 16 సెప్టెంబర్ 2025న ప్రత్యేక కమిషనర్ సమాచార మరియు పౌరసంబంధాల శాఖ హైదరాబాద్ నుండి పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫోటోగ్రాఫర్) పోస్టులను నియమించుకొనుటకు ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర్వులు వచ్చి నాలుగు నెలలు కావొస్తోన్న ఇప్పటివరకు కూడా నియామకాన్ని చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా తనను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరారు.

# దరఖాస్తుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్**



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రజావాణిలో పలు సమస్యలపై అందచేసిన ఆర్జీలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.



# జనగామకు కేటీఆర్ రాక

- **ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్యనేతలు**
- **నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమం**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాకి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సోమవారం కేటీఆర్ స్థభాస్థలిని, జనగామ కేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య, జిల్లా ముఖ్య నేతలు బబ్బురి శ్రీకాంత్ గౌడ్, పల్లా సుందర్ రాంరెడ్డి, మండల నాయకులు పరిశీలించారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహా సమావేశ నిర్వహించి BRS గెలుపే ధ్యేయంగా పని చేయాలనీ ఇంచార్జ్ లు ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలని దయాకర్ రావు పిలుపునిచ్చారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**